ఉచిత పంటల బీమాకు మంగళం

సాగు చేసిన పంటలకు రైతులే ప్రీమియం చెల్లించాలంటూ ఉత్తర్వులు



ప్రీమియం చెల్లించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)



ఏపుగా ఎదిగిన వరిచేను

యలమంచిలి: కూటమి ప్రభుత్వం రైతులను మరోసారి మోసం చేసింది.ఎన్నికల సమయంలో తమ మేనిఫెస్టో సూపర్ సిక్స్‌లో రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ హామీ పై ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. కానీ ఇప్పుడు ఎకరాకు రూ.615 పంటల బీమా పథకం ప్రీమియాన్ని రైతులే చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకు రైతులంటే ఎంత చిన్నచూపో మరోసారి నిరూపించుకున్నారు. గతంలో వ్యవసాయం దండగని వ్యాఖ్యానించి రైతులు వ్యతిరేకతను చవిచూసిన బాబు మళ్లీ తన నైజాన్ని చాటి చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు పెట్టుబడి సాయం అందించాల్సిన సీఎం చంద్రబాబు మొండిచేయి చూపి దండగ వ్యవసాయానికి సాయం ఎందుకనే తన తీరును చెప్పకనే చెబుతున్నారు. పెట్టుబడి సాయం అందక, అధిక వర్షాల వలన ఖరీఫ్ సాగు పెట్టుబడి కోసం కొట్టుమిట్టాడుతున్న రైతులపై మరో భారం మోపారు. ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడేశారు. దీంతో రైతులు, రైతు సంఘాల నేతలు కూటమి సర్కారు పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులపై పైసా భారం పడకుండా ఐదేళ్లపాటు విజయవంతంగా ఉచిత పంటల బీమాను అమలు చేసింది. దీంతో తీవ్రమైన వర్షాలు, తుఫాన్‌లు, వరదల వలన పంటలకు నష్టం వాటిల్లినప్పుడు పరిహారం రూపంలో రైతులను ఆదుకునేందుకు పంటల బీమా పథకం ఎంతగానో ఉపయోగపడేది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేసి రైతులే తమ పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించుకోవాలని ప్రకటించింది. ఇప్పటికీ చాలామంది రైతులకు బీమాకు సంబంధించిన ప్రీమియం ఎలా కట్టాలో తెలియని పరిస్థితి.

22595 రైతులపై భారం

నరసాపురం డివిజన్‌లోని నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, ఆచంట మండలాల్లో 40745 ఎకరాల భూమిలో 22595 మంది రైతులు వరి సాగు చేస్తున్నారు. పంటల బీమాకు ఎకరానికి రూ.615 చప్పున రైతులు రూ. 2,50,58,175 చెల్లించాల్సి ఉంది. రైతులపై ఈ మేరకు అదనపు ఆర్థిక భారం పడనుంది. ఈ ఖరీఫ్ పంట కాలంలో అధిక వర్షాలు, తుఫాన్‌లు, వరదల వలన ఆర్థికంగా నష్టపోయిన రైతులకు ఈ అదనపు భారం శాపంగా మారింది. బీమా చెల్లించకపోతే పంట నష్టపోతే నష్ట పరిహారం చిల్లిగవ్వ రాని పరిస్థితి. ఈ నేపథ్యంలో అదనపు అప్పులు చేసి బీమా చేయించాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

డివిజన్‌లో రైతులు ఇలా

మండలం	ఎకరాలు	రైతులు	ప్రీమియం (రూ.)
నరసాపురం	3570	2058	21,95,550
మొగల్తూరు	648	238	3,98,520
యలమంచిలి	4380	2845	26,93,700
పాలకొల్లు	9222	5742	56,71,530
పోడూరు	12865	630	79,11,975
ఆచంట	10060	5412	61,86,900
మొత్తం	40745	22595	2,50,58,175

ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించాలి



రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించాలి. గత ప్రభుత్వం పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించి పంటలు నష్టపోయిన సందర్భాల్లో రైతులకు పరిహారాన్ని చెల్లించి ఆదుకునేది. దీంతో పంటలు నష్టపోయినప్పటికీ రైతుకు పరిహారం ఊరటనిచ్చేది.

– అడబాల రామ్మోహనరావు, రైతు, మేడపాడు

గడువులోగా ప్రీమియం చెల్లిస్తేనే బీమా



రబీలో వరి పంటకు ప్రభుత్వం నిర్దేశించిన మొత్తం గడువులోగా రైతులే ప్రీమియం ఎకరాకు రూ. 615 చెల్లించాలి. రైతులు సాగు చేసిన వరి పంటకు డిసెంబర్ 31 వరకు ప్రీమియం చెల్లించొచ్చు. ప్రీమియం చెల్లిస్తేనే పంటలకు నష్టం వాటిల్లినప్పుడు బీమా వస్తుంది. బీమా చెల్లించని రైతులకు నష్ట పరిహారం రాదు.

– చిందులూరి దేవి,
మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి



పోస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రిశూలపాణి

మొగల్తూరు: ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల లబ్ధి తమ ఖాతాల్లో జమ కావాలంటే ప్రతి లబ్ధిదారుడూ తమ బ్యాంకు అకౌంట్‌కు ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలని ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ శాఖ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోస్టల్ ఉద్యోగులు కూడా తమ కార్యాలయాలకు వచ్చే లబ్ధిదారులకు అవగాహన కల్పించి లబ్ధిదారుల ఖాతాలను బ్యాంక్ లేదా పోస్టాఫీస్ ఖాతాలకు లింక్ చేయాలని సూచించారు. సమావేశంలో పోస్ట్‌మాస్టర్ వై.రాజ్‌కిరణ్, సిబ్బంది కమల్, ఎం.మురళీ కృష్ణ, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే సమగ్రాభివృద్ధి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రిశూలపాణి

మొగల్తూరు: ప్రణాళికతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి సూచించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ ఆర్థిక ప్రణాళికలపై గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లతో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణా తరగతిలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు ప్రణాళిక ప్రకారం ఖర్చు చేస్తే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ ప్రభాకరరావు, ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్, పీఆర్ జేఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెదమల్లంలో తాటాకిల్లు దగ్ధం



పెదమల్లంలో అగ్నికి ఆహుతైన తాటాకిల్లు

పెనుగొండ: ఆచంట మండలం పెదమల్లం శివారు సిర్రా వారి పేటలో శుక్రవారం తాటాకిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. లంక ధనరాజుకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. భార్య, కుమారుడు పనులకు వెళ్లగా, కుమార్తె కళాశాలకు వెళ్లడంతో ఇంటిలో ఎవరూలేని సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. పాలకొల్లు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. బంగారం, రూ.80 వేలు నగదు, ఇంటిలోని సామాను పూర్తి కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.5లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మి, ఆర్ఐ లక్ష్మీ, వీఆర్‌ఓ శేషగిరిలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

గ్రామసభల్లో భూ-సమస్యల పరిష్కారం

మొగల్తూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వే గ్రామ సభల్లో రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ సూచించారు. శుక్రవారం మొగల్తూరు 3వ సచివాలయ పరిధిలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రీ-సర్వేలో ఏమైనా సమస్యలుంటే గ్రామ సభల్లో ఫిర్యాదు ఇస్తే వాటిని పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సభలో గ్రామ సర్పంచ్ పడవల మేరీ, సర్వేయర్ ధనరాజ్, డీటీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు శివారు వెదుళ్లపాలెంలో బెల్ట్ షాపు ద్వారా మద్యం విక్రయిస్తున్న మాదు వెంకటేశ్వరరావును శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడ్ని నుంచి 7 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అరట్లకట్ట కమ్ములో ఫ్యామిలీ ఫిజీషియన్

పాలకొల్లు అర్బన్: మండలంలోని అరట్లకట్ట కమ్ములో శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషయన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ అద్దాల ప్రతాప్‌కుమార్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఏఎన్ఎం రూప తదిరులు పాల్గొన్నారు.

శివశివ శంకర..హరహర శంకర

శివాలయాల వద్ద కార్తీక పౌర్ణమి సందడి



పాలకొల్లు సెంట్రల్: ప్రత్యేకాలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి



యలమంచిలి: మేడపాడులో ఆకట్టుకున్న దీపోత్సవం



పాలకొల్లు అర్బన్: ప్రత్యేక అలంకరణలో శ్రీ శివదేవస్వామి

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం కార్తీకపౌర్ణమి శుక్రవారం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామున కాలువస్నానాలు ఆచరించిన మహిళలు కాలువ గట్టున కార్తీకదీపాలను వెలిగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి నూతన వధువులు పువ్వు, పిందె, 11 కాయలతో ఉన్న అరటిపండ్ల అస్తం, కొబ్బరి బొండాలు, బియ్యం, కందగొడుగు, పసుపు గొడుగులను తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయం వద్ద యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో బాదం పాలు పంపిణీ చేశారు. పౌర్ణమి కావడంతో ప్రతీ నెలా నిర్వహించే చండీహోమం అభిషేకాల మండపంలో మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించారు.

మేడపాడులో..

యలమంచిలి: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం శివ, కేశవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని కార్తీక దామోదరునికి దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా రాత్రి ఆలయాల ప్రాంగణంలో జ్వాలాతోరణం వెలిగించారు. మేడపాడు శివాలయం వద్ద జరిగిన జ్వాలాతోరణంలో అయ్యప్పమాల ధరించిన స్వాములు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్ విగ్రహం వద్ద ఉన్న రామాలయం వద్ద సహస్ర దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. శివలింగం, తిరునామం, ఓంకారం, త్రిశూలం ఆకారంలో ముగ్గులు వేసి వాటి చుట్టూ 1116 దీపాలు వెలిగించారు. గ్రామానికి చెందిన ముద్దల ఉదయభాస్కర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ సహస్ర దీపాలంకరణలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని దీపాలు వెలిగించారు.

శివదేవుని చిక్కాలలో

పాలకొల్లు అర్బన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా వాయు త్రిలింగ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక పౌర్ణమి నోములు నోచుకున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని శివదేవునిచిక్కాలలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామిని, ఆలాగే దిగమర్రులోని శ్రీ ఉమా నరేంద్రస్వామి వార్లను భక్తులు దర్శించుకున్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రసిద్ధ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆచంటలోని ప్రసిద్ధి చెందిన ఆచంటేశ్వరుని ఆలయం, సిద్ధాంతంలోని కేదారేశ్వరుని, నందీశ్వరుని ఆలయం, పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయం, వాసవీ శాంతి ధాంలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాం నుంచి వశిష్టా గోదావరి, నర్సాపురం ప్రధాన కాలువ, రామగుండం చెరువుల్లో కార్తీక దీపాలు వెలిగించి,. ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. కొత్తగా వివాహం చేసుకున్న నవ వధవులు కొబ్బరి బొండం, కంద తొడుగులతో ఆలయ ప్రదిక్షణ చేసి స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాఆగే ఆచంటలోని ఉమారామేశ్వర స్వామిని తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యుడు అక్కిన ముని కోటేశ్వరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కినను దేవస్థానం ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయన, గణేశ్వరరావు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆచంటేశ్వరుని ఆలయాభివృద్ధికి తోడ్పాటు నందించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. అనంతరం గంధర్వ మహల్‌ను సందర్శించారు. అక్కినను గంధర్వ మహల్‌లో గొడర్తి విద్యా సాగర్, శ్రీరాములుతో పాటు పలువురు సత్కరించారు.

పెనుమంత్రలో..

పెనుమంత్ర: మార్టేరు గ్రామంలో వేంచేసియున్న శ్రీఅయ్యప్పస్వామివారి ఆలయం వద్ద శుక్రవారం అయ్యప్ప స్వామికి కలశ పడిపూజలతో పాటు శివకేశవుల కల్యాణం, కార్తీక దీపోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసుల వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో అడబాల శ్రీనివాస్, వెంకటరమప్రభ దంపతులు అయ్యప్పస్వామికి గణపతి హోమం నిర్వహించారు. శ్రీస్వామివారికి పంచామృత అభిషేకాలు జరిపారు. ఆచంట శివ, మల్లిడి రామకృష్ణారెడ్డి, తలుపురి సత్యనారాయణ, తమనంపూడి విజయగురుస్వాముల ఆధ్వర్యంలో కలశ పడిపూజ నిర్వహించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: కార్తీక పౌర్ణమి రోజు శుక్రవారం శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే ఆలయాలకు చేరుకున్న భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయాల్లోని ధ్వజ స్తంభం, ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీశైలం తరువాత మొగల్తూరులోని వనమల్లికార్జునుని ఆలయంలో శివలింగాన్ని తాకే అవకాశం ఉండటంతో భక్తులు శివలింగానికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం వశిష్ట గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. లక్ష్మణేశ్వరం దుర్గా లక్ష్మణేశ్వరస్వామి వారి ఆలయంలో వేకువజామునుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. లక్ష్మణేశ్వరంలోని స్వామివారికి ఐదు విశేష హారతులను ఇచ్చారు. మండలంలోని కొప్పర్రు, ఎల్చీచర్ల గ్రామాల్లోని శివాలయాల్లోనూ పూజలు చేశారు.

రేవుల్లో కార్తీక సందడి

నరసాపురం: కార్తీక పౌర్ణమి పూజలు శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పవిత్ర గోదావరిలో స్నానాలు చేసి నదిలో దీపాలు వదిలారు. దీంతో గోదావరి వలందర్‌రేవు, లలితాం బఘాట్, అమర్వేరఘాట్ వద్ద తెల్లవారు జాము నుంచి భక్తుల రద్దీ నెలకొంది. వలందర్‌రేవులో పెద్ద ఎత్తున స్నానాలు చేశారు. కపిల మల్లేశ్వర స్వామి ఆలయం, అమర్వేరస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.



నరసాపురం: వలందర్‌రేవు వద్ద జల్లు స్నానాలు చేస్తున్న భక్తులు



పెనుమంత్ర: మార్టేరులో నిర్వహిస్తున్న శివకేశవుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరునికి పూజా సామగ్రి ఇస్తున్న దృశ్యం



పెనుగొండ: కేదారీఘాట్‌లో కార్తీక దీపాలు వదులుతున్న భక్తులు

నేడు అయ్యప్పస్వామి ఆలయంలో పడి పూజ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు, నరసాపురం రోడ్డులో పూలపల్లి బైపాస్ వద్ద ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం పడిపూజ నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చల్లా బాబుల్ గురుస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాత్రి 7గంటల సమయంలో సినీ నిర్మాత గవర ఉదయ శ్రీనివాస్, కిరణ్మయి దంపతులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. భజన కార్యక్రమానికి అయ్యప్ప, శివయ్య, భవానీ మాలధారులు హాజరుకావాలని కోరారు.

పిచ్చికుక్క స్వైర విహారం

నరసాపురం: పట్టణంలో 11వవార్డులో శుక్రవారం మధ్యాహ్నం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. వార్డులో ముగ్గురిని, తరువాత సమీపంలో ఉన్న ఎండుచేపల మార్కెట్ వద్ద మరొకరిని కరిచింది. పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారిలో ఓ వృద్ధుడు, ఓ బాలుడు, ఓ మహిళ ఉన్నారు. గాయపడిన వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుని వ్యాక్సిన్ వేయించుకున్నారు. ఇటీవల కాలంలో పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నా మున్సిపల్ అధికారులు వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్జలు విమర్శిస్తున్నారు.

ఘనంగా పాండురంగ స్వామి కల్యాణోత్సవం



ప్రత్యేకాలంకరణలో పాండురంగ స్వామి

మొగల్తూరు: తీరంలోని కేపీ పాలెం బీచ్‌లో ఉన్న పాండురంగ స్వామి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని ప్రతిష్టించిన అందే రంగారావు–నాగవేణి దంపతుల స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమానికి తీర ప్రాంతంలోని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఏఎస్సైకు సత్కారం



రాజేంద్రను సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది

మొగల్తూరు: మొగల్తూరు స్టేషన్‌లో ఏఎస్సై బాధ్యతలు నిర్వహించడం సంతృప్తినిచ్చిందని ఏఎస్సై యు.రాజేంద్ర తెలిపారు. 2021లో బదిలీపై మొగల్తూరు స్టేషన్‌కు వచ్చిన ఆయన పెంటపాడు ఏఎస్సైగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఎస్సై జి.వాసు, మహిళా ఎస్సై నాగలక్ష్మి, స్టేషన్ సిబ్బంది రాజేంద్రను ఘనంగా సత్కరించారు.

తూర్పుకాపులకు మొండిచేయి



లోపింటి చిరంజీవి

పాలకొల్లు అర్బన్: తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల పదవుల నియామకంలో అధిక జనాభా కలిగిన పశ్చిమ, కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ప్రాధాన్యత కల్పించడంలో కూటమి నేతలు మొండి చేయి చూపించారని ఆ సంఘ రాష్ట్ర నాయకుడు లోపింటి చిరంజీవి ధ్వజమెత్తారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తూర్పు కాపు సామాజిక వర్గం కాని రాజమండ్రికి చెందిన వెలమ కులానికి చెందిన వ్యక్తికి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి కేటాయించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ విషయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలోనే కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని సంతోషం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కార్పొరేషన్‌లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.



హామీలు విస్మరించి ప్రజలపై భారాలు



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నరసాపురం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు విస్మరించి ప్రజలపై పెనుభారాలు మోపుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదరిశ ముచ్చర్ల త్రిమూర్తులు విమర్శించారు. పేదలపై ఆర్థిక భారాలు వేసే విధానాలను విరమించుకోవాలని కోరుతూ శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 14వతేదీ వరకూ ప్రజా పోరు పేరుతో ఇంటింటికీ తిరిగి ప్రజాసమస్యలు తెలుసుకున్నామని చెప్పారు. పొగాకు నారాయణరావు, తెలగంశెట్టి సత్యనారాయణ, జి.రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి



నరసాపురం: పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం: ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నరసాపురం ప్రథమశ్రేణి గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శేఖర్‌బాబు పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో గొప్పగొప్ప వ్యక్తులు అందరూ పుస్తకాలు చదవడం ద్వారానే తమతమ జీవితాల్లో విజయాలు సాధించారని చెప్పారు. లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి మాట్లాడుతూ తమ గ్రంథాలయంలో 37800 పుస్తకాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ శాస్త్రవేత్త రంగినీడి సుబ్బారావు, వ్యాఖ్యాత సీహెచ్ రెడ్డ పృథవేజీ, రోటరీక్లబ్ అధ్యక్షురాలు సత్యవతి, ప్రముఖ నేత్ర వైద్యుడు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిన్నూరులో వ్యాసరచన పోటీలు

పాలకొల్లు అర్బన్/పెనుగొండ: మండలంలోని జిన్నూరు గ్రంథాలయ ఆవరణలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి సుమారు 70 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు జామాను రామలక్ష్మణ్, గ్రంథాలయ అధికారి సీఆర్‌పీ భారతి, బండారు వెంటరమణ, విజయ వ్యాసరచన పోటీలను పర్యవేక్షించారు. అలాగే పండిత విల్లూరు గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తక ప్రదర్శనను కొడేటి రామకృష్ణ ప్రారంభించి, పుస్తకం వల్లకలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో బలుసు సత్యనారాయన, కోరాడ శ్రీను, ఆచంట భాస్కర్రావు, గ్రంథాలయాధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.